క్లుప్తంగా

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఓ రవిప్రకాష్

ఉయ్యాలవాడ : ఉపాధి హామీ పథకం కింద కూలీల సంఖ్య పెంచేందుకు క్షేత్రస్థాయిలో సమష్టి బాధ్యతతో పని చేయాలని ఆ శాఖ ఏపీఓ రవిప్రకాష్ సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి రోజు 2,800 మంది కూలీలు పనుల్లో పాల్గొనేలా లక్ష్యాన్ని నిర్దేశించారని చెప్పారు. ప్రస్తుతం రోజుకు 1,008 మంది మాత్రమే పనుల్లో పాల్గొంటున్నారు. సుద్దమల్ల, సర్వాయిపల్లె, రూపనగుడి, బోడెమ్మనూరు గ్రామాలలో 20 శాతంలోపే కూలీలు హాజరవుతుండడంపై ఫీల్డ్ అసిస్టెంట్ల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీల సంఖ్య పెంచేందుకు శ్రమించాలని ఆదేశించారు.

307 గృహ నిర్మాణాలు పూర్తి

ఉయ్యాలవాడ : మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలో 307 గృహాల నిర్మాణాలు పూర్తయినట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, హౌసింగ్ ఏఈ నాగరాజు తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణ పనుల వేగవంతంపై ఉన్నతాధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్మాణాలు పూర్తయిన గ్రామాలలో ఉగాది పండుగ రోజు గృహ ప్రవేశాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. మండలానికి 962 గృహాలు మంజూరు కాగా బేస్ మట్టం లెవెల్‌లో 538 గృహాలు, ఆర్‌సీ లెవెల్లో 16 గృహాల్లో నిర్మాణాలు కొనసాగుతున్నట్లు చెప్పారు. నిర్మాణాలు వేగవంతం చేసేందుకు క్షేత్రస్థాయిలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో కలిసి లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.


రశీదు తప్పనిసరి



మాట్లాడుతున్న డాక్టర్ మద్దిలేటి

శిరివెళ్ల: మార్కెట్లో వస్తువులు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని వినియోగదారుల ఫోరం మండల గౌరవాధ్యక్షుడు డాక్టర్ మద్దిలేటి అన్నారు. బుధవారం యర్రగుంట్ల-1వ గ్రామ సచివాలయంలో ప్రపంచ వినియోగదారుల దినోత్సవం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఏటా మార్చి 15న వినియోగదారుల దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. నేడు నాణ్యతా లోపం, నకిలీల బెడద అధికంగా ఉందని, అందువల్ల వస్తువులను కొనప్పుడు దుకాణ యజమానుల నుంచి రశీదులు అడగాలని సూచించారు. మోసపోయిన వారు రశీదు ద్వారా నష్ట పరిహారం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం



మాట్లాడుతున్న తహసీల్దార్ జయప్రసాద్

దొర్నిపాడు: ప్రభుత్వం తీసుకొచ్చిన భూ రీసర్వేతో రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ జయప్రసాద్ పేర్కొన్నారు. జగనన్న శాశ్వత భూ హక్కు-భూ రక్ష పథకంలో భాగంగా బుధవారం మండలంలోని గుండుపాపల, కొండాపురం, డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామాల్లో రీ సర్వేపై గ్రామ సభలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధునాతన సాంకేతిక పరికరాలతో భూ సర్వే చేస్తున్నట్లు చెప్పారు. హద్దుల విషయంలో ఇబ్బందులు పడుతున్న రైతులకు రీసర్వేతో సమస్యలు తీరుతాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకుడు గోపవరం కాశీవిశ్వనాథ్ రెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వర్లు, డీటీ రవి, సర్వేయర్ మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి వెంకట నారాయణ పాల్గొన్నారు.

ఈ-పంట నమోదును సరిచూసుకోండి



జాబితాపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

గోస్పాడు: ఈ-పంట నమోదును రైతులు జాబితాలో సరిచూసుకోవాలని ఏఓ అబ్దుల్ హక్ తెలిపారు. మండలంలోని గ్రామాల పరిధిలో ఆర్బీకే కేంద్రాల వద్ద బుధవారం గ్రామ సభలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన పైర్ల వివరాలు, సర్వే నంబర్లు, రైతుల పేర్లు సిబ్బంది నమోదు చేసిన జాబితాలో సక్రమంగా ఉన్నాయా లేదో సరిచూసుకోవాలని చెప్పారు. అన్ని ఆర్బీకే కేంద్రాల వద్ద జాబితాలను సిబ్బంది ఇప్పటికే ప్రదర్శనకు ఉంచారన్నారు. జాబితాలో ఏవైనా తప్పులున్నా, సందేహాలు ఉంటే తమ దృష్టి తీసుకురావాలని కోరారు. ఈ విషయాన్ని రైతుల గుర్తించి సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆడబిడ్డల భవితకు భరోసా

- 'సుకన్య సమృద్ధి యోజన' ఆడపిల్లలకు వరం



నూనెపల్లెలోని పాఠశాలలో పథకంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

నంద్యాల: ఆడబిడ్డల ఉజ్వల భవితకు ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పథకం సుకన్య సమృద్ధి యోజన. మిగతా పొదుపు ఖాతాలతో పోలిస్తే ఇందులో ఇచ్చే వడ్డీ ఎక్కువ. ప్రారంభంలో పథకాన్ని ప్రారంభించాలంటే రూ.1000 డిపాజిట్ చేయాల్సి ఉండేది. అంత మొత్తం ఒకేసారి జమ చేసేందుకు స్తోమతలేని నిరుపేదలు ఈ పథకంపై వెనుకంజ వేసేవారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆ మొత్తాన్ని రూ.1000 నుంచి రూ.250కి తగ్గించింది. పదేళ్లలోపు బాలికలు ఈ పథకానికి అర్హులు. ఒక కుటుంబం నుంచి ఇద్దరు అమ్మాయిలకు, ఒక వేళ మొదటి కాన్పులో ఒక అమ్మాయి, రెండో కాన్పులో ఇద్దరు అమ్మాయిలు పుట్టినా ఈ పథకం వర్తిస్తుంది. దీనిని అందరికీ చేరువ చేయాలనే లక్ష్యంతో పోస్టల్ అధికారులు ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. పాఠశాలలు, విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి వివరిస్తున్నారు.

ఖాతా ప్రారంభానికి కావాల్సినవి..

- తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, బాలికల పుట్టిన రోజు ధ్రువ పత్రాలు
- తల్లిదండ్రులతో కలిసి దిగిన ఫొటో
- తల్లిదండ్రులు రేషన్ కార్డు
- దేశంలో ఏ తపాలా కార్యాలయంలోనైనా ఒక బాలిక పేరున ఒక ఖాతా తెరవాలి

ఏడాదికి ఎంత కట్టాలి..

కుటుంబ ఆర్థిక స్తోమతను బట్టి ఏడాదికి కనిష్టంగా రూ.250 నుంచి గరిష్టంగా రూ.1.50 లక్షల వరకు జమ చేయవచ్చు. ఖాతా తెరిచినప్పటి నుంచి 15 ఏళ్ల పాటు క్రమం తప్పకుండా నగదు జమ చేయాలి. అమ్మాయి పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన తర్వాత, 18 ఏళ్లు నిండాక, ఉన్నత విద్యకు 50 శాతం నగదు తీసుకోవచ్చు. వివాహం కోసం ముందస్తుగా ఖాతాను రద్దు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తారు. ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.250 చెల్లించకపోతే దానిని తిరిగి వాడుకలోకి తెచ్చేందుకు రూ.50 అపరాధ రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఏడాదికి 7.6 శాతం వడ్డీ చెల్లిస్తారు. ఈ వడ్డీని ఏటా అసలులో కలిపి చక్రవడ్డీగా చెల్లిస్తారు. ఆదాయ పన్ను మినహాయింపు ఉంటుంది. గతంలో ఎక్కడ ఖాతా ప్రారంభిస్తే అక్కడ మాత్రమే డబ్బులు చెల్లించాల్సి వచ్చేది. ప్రస్తుతం అంతా ఆన్‌లైన్ చేయడంతో ఎక్కడైనా చెల్లించుకోవచ్చు. ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి ఉచితంగా బదిలీ చేసుకునే వెసులుబాటు కూడా ఉంది.

పథకం వివరాలు..

- ఈ ఖాతా బాలిక వివాహం వరకు లేదా ప్రారంభ తేదీ నుంచి 21 సంవత్సరాలు వరకు ఆపరేట్ అవుతుంది.
- ఈ ఖాతా కోసం కనీస డిపాజిట్ మొత్తాన్ని రూ.వెయ్యి నుంచి గరిష్టం సంవత్సరానికి రూ.1,50,000 వరకు డిపాజిట్ చేయవచ్చు.
- ఈ ఖాతాలో డబ్బును 14 సంవత్సాలు ఉంచవలసి ఉంటుంది.
- అకౌంట్ తెరచిన తరువాత 15 ఏళ్ల పాటు డబ్బులు చెల్లించాలి. ఆ తరువాత చెల్లించాల్సిన అవసరం లేదు. పథకం కాల పరిమితి 21 ఏళ్లు. అమ్మాయికి 18 ఏళ్లు వచ్చిన తరువాత కొంత మొత్తం విత్ డ్రా చేసుకోవచ్చు. 21 ఏళ్ల తరువాత పూర్తిగా తీసుకోవచ్చు.
- ప్రస్తుతం ఈ పథానికి వడ్డీ రేటు 7.6 శాతంగా ఉంది. ఈ వడ్డీ రేటు ఎప్పుడూ ఒకేలా ఉండదు. ప్రతి మూడు నెలలకోసారి కేంద్ర ప్రభుత్వం వడ్డీ రేటును సమీక్షిస్తుంటుంది. అందువల్ల వడ్డీ రేటు పెరగొచ్చు, లేదా తగ్గొచ్చు. నిలకడగా కూడా కొనసాగవచ్చు.
- ఈ ఖాతాలో జమ చేసిన మొత్తానికి ఆదాయ పన్ను చట్టం సెక్షన్ 80సీ కింద గరిష్టంగా రూ.1,50,000వేల వరకు పన్ను మినహాయింపు లభిస్తుంది.

21వేలకు పైగా ఖాతాలు

సుకన్య సమృద్ధి యోజన పథకం పట్ల ప్రజల్లో అవగాహన పెరుగుతోంది. ఈ పథకం కింద ఖాతా తెరిస్తే ఆడపిల్లలకు పెళ్లి సమయానికి, ఉన్న విద్యకు రక్షణగా ఉంటుంది. ఇప్పటికే నంద్యాల జిల్లాలో 21,500 ఖాతాలు తెరిచాం. గత ఏడాది ఏప్రిల్ నుండి ఇప్పటి వరకు 7,400 ఖాతాలు ఈ పథకం కింద తెరువబడ్డాయి. ఆడపిల్లలు తల్లిదండ్రులకు ఈ పథకం ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ఆసక్తి గల వారు వారికి సమీపంలోని తపాలా కార్యాలయాలకు వెళ్లి ఖాతాలు తెరుచుకోవచ్చు. జిల్లాలో 282 బ్రాంచ్ పోస్టాఫీసులు, 43 సబ్ పోస్టాఫీసులు ఉన్నాయి. ప్రస్తుతం లావాదేవీలన్నీ డిజిటల్ విధానంలో జరుగుతున్నాయి. కావున ఎక్కడైనా ఖాతాదారులు తమ ఖాతాను ప్రారంభించుకోవచ్చు.

– శ్రీనివాసరావు, పోస్టల్ సూపరింటెండ్, నంద్యాల

కూలీలకు పనులు కల్పించండి

నంద్యాల(రూరల్): మండలంలోని అన్ని గ్రామాల్లో అర్హులైనా ప్రతి కూలీకి ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించాలని ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో బుధవారం ఫీల్డ్‌అసిస్టెంట్లతో ఉపాధి పనులపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులకు వచ్చే కూలీలకు దినసరి వేతనం రూ.200 నుంచి 280 వరకు వచ్చే విధంగా మస్టర్లు వేయాలని ఆదేశించారు. గ్రామస్థాయి అధికారులు, నాయకుల సమన్వయంతో ఉపాధి పనులను చూపించాలని సూచించారు. కూలీల సంఖ్య పెంచాలని, అధికారులిచ్చిన టార్గెట్‌లను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. ఏపీఓ శ్రీకళరెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

వీధి కుక్కలను అరికట్టాలి

నంద్యాల(సిటీ): పట్టణంలో పెరిగిపోతున్న వీధి కుక్కలను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని ఏఐఎఫ్‌బీ రాష్ట్ర కార్యదర్శి రాజునాయుడు కోరారు. కుక్కలతో హైదరాబాద్ లాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరుతూ బుధవారం ఏఐఎఫ్‌బీ నాయకులు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డికి వినతి పత్రం అందజేరు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలో దాదాపు 5వేలకు పైగా వీధి కుక్కలు ఉన్నాయని నిత్యం ఏదో ఒక ప్రాంతంలో కుక్క కాటుకు గురైన బాధితులు ఆసుపత్రిలో చికిత్సలు పొందుతూనే ఉన్నారన్నారు. రాత్రి 9 గంటలు దాటితే ప్రధాన కూడళ్లలో సైతం వీధి కుక్కల సంచారం అధికమైందని, పలు మార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు.

కాలినడకన సాయినాథుని చెంతకు



పాదయాత్రగా బయలు దేరిన రామచంద్రాపురం వాసులు

దొర్నిపాడు: మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన శ్రీ షిర్డిసాయి సేవాసమితి సభ్యులు ఉత్సవ పల్లకీలో సాయినాథుడిని కొలువుంచి బనగానపల్లి సమీపంలో యాగంటి క్షేత్రం దారిలో నిర్మించిచన శ్రీసద్గురు సాయి మందిరం రెండో వార్షికోత్సవం సందర్భంగా కాలినకడన బయలు దేరారు. బుధవారం దొర్నిపాడులో నూతనంగా నిర్మిస్తున్న సాయిబాబా మందిరం వద్ద ప్రత్యేక పూజల అనంతరం బయలు దేరారు. భాగ్యనగరం, కొండాపురం, దొర్నిపాడు, భీమునిపాడు, కొవెలకుంట్ల బనగానపల్లి మీదుగా ఈనెల 17న సాయిబాబా మందిరానికి చేరుకోనున్నారు. గ్రామానికి చెందిన ఉప సర్పంచి బబ్బూరి శిరీష, మాజీ సొసైటీ చైర్మన్ బబ్బూరి వెంకటస్వామి కాలినడకన వెళ్లే భక్తులకు భోజన వసతి ఏర్పాటు చేశారు.

రసీదు తప్పనిసరి



మాట్లాడుతున్న డీఎస్‌ఓ ఆచార్యులు

నంద్యాల(వ్యవసాయం): ఏదైనా వస్తువు కొనుగోల చేసినప్పుడు వినియోగదారులు రసీదు తప్పనిసరిగా అడిగి తీసుకోవాలని డీఎస్‌ఓ ఆచార్యులు తెలిపారు. బుధవారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పౌరసరఫరాల కార్యాలయంలో జిల్లా వినియోగదారుల రక్షణ మండలి అధ్యక్షుడు న్యాయవాది సయ్యద్ అమీర్‌బాషా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఏఎస్‌ఓ రవిబాబు, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌రావు, పక్కీర్‌సాబ్, లీగల్ మెట్రాలజీ అధికారి అనిత, విజయ్‌కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

బీమా తక్షణ సాయం అందజేత



బాధితురాలికు బీమా సొమ్ము అందజేస్తున్న దృశ్యం

రుద్రవరం: మండలంలోని టీ.లింగదిన్నెకు చెందిన లక్ష్మీదేవి అనే బాధితురాలుకు సచివాలయ ఉద్యోగులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు హరినారాయణ తదితరులు బుధవారం వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10వేలు అందజేశారు. ఇటీవల ఆమె భర్త మందలూరి లింగమయ్య గుండె పోటుతో మృతి చెందాడు. ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం నుంచి మంజూరైన ఆర్థిక సాయాన్ని అందజేసినట్లు వారు తెలిపారు.

ఆలమూరులో అగ్ని ప్రమాదం

రుద్రవరం: మండలంలోని ఆలమూరు పంట పొలాల్లో బుధవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. ఆ ప్రమాదంలో ఇమాంస అనే రైతుకు చెందిన కొబ్బరి, నిమ్మకాయ చెట్లు కాలి దెబ్బతిన్నాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన ఓ రైతు రబీలో సాగు చేసిన మొక్కజొన్న పంట కోత కోయించాడు. కోత పూర్తవగానే మొక్కజొన్న వ్యర్థాలకు నిప్పు పెట్టాడు. దీంతో పొలంలోని ఈకలన్నీ మంటల్లో కాలుతున్నాయి. అయితే గాలి అధికమవడంతో మంటలు చెలరేగాయి. ఆ పొలం పక్కనే ఉన్న ఇమాంస అనే రైతు పొలం గట్టుపైకి వ్యాపించాయి. అక్కడున్న గడ్డితో పాటు గట్టుపై ఉన్న పలు కొబ్బరి చెట్లు, పక్కనే ఉన్న నిమ్మచెట్లకు మంటలు వ్యాపించాయి. విషయం తెలియగానే ఆళ్లగడ్డ అగ్నిమాపక శాఖ సిబ్బంది వెళ్లి మంటలను ఆర్పి వేశారు. ఈ విషయంపై ఎస్‌ఐ నిరంజన్‌రెడిని అడుగగా అగ్ని ప్రమాదం సంభవించింది వాస్తవమేనని పూర్తి వివరాలు సేకరించి కేసు నమోదు చేస్తామని తెలిపారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

శిరివెళ్ల: యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్మీడియెట్ పరీక్షలు మొదలయ్యాయి. ప్రథమ సంవత్సరం పరీక్షలకు ఒక విద్యార్థి గైర్హాజరయ్యారు. మొత్తం 184 మందికి గాను 183 మంది తెలుగు, హిందీ, ఉర్దూ పరీక్షలు రాశారు. పరీక్షలకు నాగార్జున సిట్టింగ్ స్క్వాడ్‌గా వ్యవరించగా, ఫ్లయింగ్‌స్క్వాడ్ పరీక్షల నిర్వహణను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.

నెహ్రూ మహిళా మండలి అధ్యక్షురాలి మృతి



సత్యవతమ్మ (ఫైల్)

నంద్యాల(అర్బన్): పట్టణంలోని నెహ్రూ మహిళా మండలి అధ్యక్షురాలు సత్యవతమ్మ (80) మంగళవారం రాత్రి గుండె పోటుతో మృతి చెందారు. వెంకటాచలం కాలనీకి చెందిన సత్యవతమ్మ స్వచ్ఛంద సంస్థ ద్వారా మహిళలకు కుట్టు శిక్షణ, వయోజన విద్య, వృద్ధులకు పెన్షన్లు, పొదుపు గ్రూపుల ఏర్పాటు తదితర సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టింది. వైఎస్సార్ చేపట్టిన పాదయాత్ర సమయంలో నంద్యాల పరిసరాల్లో పాల్గొని మన్ననలు పొందింది. ఆమె మృతి పట్ల స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ నాయకులు సంతాపం వ్యక్తం చేసి నివాళులర్పించారు.

బాల్య వివాహం అడ్డగింత

శిరివెళ్ల: మండల కేంద్రంలో ఓ బాలికకు వివాహం చేస్తున్నారని తెలిసి ఓ పాఠశాల ఉపాధ్యాయులు, పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు బుధవారం అడ్డుకుని నిలిపివేశారు. బాలిక తల్లిదండ్రులను తహసీల్దార్ ఎదుట హాజరుపరచగా వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. తహసీల్దార్ షేక్ మొయిద్దీన్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండని బాలికలకు పెళ్లి చేస్తే శిక్ష తప్పదని హెచ్చరించారు. చిన్న వయస్సులో పెళ్లి చేయడంలో బాలికలకు ఎన్నో అనర్థాలు కలుగుతాయని వివరించారు. కాగా సదరు బాలిక ఓ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది.

చలివేంద్రం ప్రారంభం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో నాగుల కుంట రోడ్డులో అసద్‌బై ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జమాతే ఇస్లామీ హింద్ అధ్యక్షుడు సమ్మద్ బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్ల నుంచి అసద్‌బై వారి తండ్రి అబ్దుల్ రజాక్ జ్ఞాపకార్థంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. మార్చిలోనే ఎండలు తీవ్రంగా ఉండడంతో ముందుగా చలివేంద్రాలను ప్రారంభించి పాదాచారుల దాహార్తిని తీర్చడం అభినందనీయమన్నారు.

వేతనాలు పెంచాలి

నంద్యాల(అర్బన్): స్కీం వర్కర్ల వేతనాలు పెంచాలని, ఈ మేరకు బడ్జెట్‌లో ప్రత్యేక నిధుల కేటాయింపు జరిగేలా చర్యలు చేపట్టాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య కోరారు. స్థానిక నూనెపల్లె మున్సిపల్ హై స్కూల్‌లో మధ్యాహ్న భోజన పథక నిర్వాహకుల సమస్యలను బుధవారం ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 17న నిర్వహించే ఛలో అసెంబ్లీ మహాధర్నా కార్యక్రమానికి వర్కర్లు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమితి సభ్యులు అబ్బాస్, మిడ్‌డే మీల్స్ నిర్వాహకులు వరలక్ష్మి, ధనలక్ష్మి, వెంకటేశ్వరమ్మ, మాధవి పాల్గొన్నారు.

టిడ్కో గృహాల పరిశీలన



టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న చైర్ పర్సన్, అధికారులు

నంద్యాల(సిటీ): పట్టణ పరిధిలోని ఎస్సార్బీసీలో ఉన్న డబల్ బెడ్ రూం టిడ్కో గృహాలను మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసా, టిడ్కోఎస్‌ఈ (సూపరింటెండెంట్ ఇంజనీర్) రాజశేఖర్ బుధవారం పరిశీలించారు. గృహాల్లో లబ్ధిదారులకు అవసరమైన మౌలిక వసతుల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చైర్ పర్సన్ మాట్లాడుతూ డబల్ బెడ్ రూం టిడ్కో గృహాలను ఈ నెలాఖరులోగా లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పార్టీలకు అతీతంగా అర్హులైన వారందరికీ గృహాలను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ రమణమూర్తి, మెప్మా సీఎంఎం విజయభాస్కరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



మృతుడి కుమారుడుకి నగదు అందజేస్తున్న దృశ్యం

గోస్పాడు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ మోహన్ కుటుంబానికి మండల జాతీయ ఉపాధి హామీ పథకం కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆర్థిక సాయం అందజేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఈఓఆర్డీ నాగేంద్రుడు, ఏపీఓ నాగజ్యోతి ఆధ్వర్యంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్‌లు, కంప్యూటర్ ఆపరేటర్‌ల సహకారంతో రూ.1.25 లక్షలు సమీకరించారు. ఆ మొత్తాన్ని మృతుడు మోహన్ కుమారుడు మనోజ్‌కు అందించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌ల సంఘం మండల అధ్యక్షుడు సద్దల నాగజ్యోతీశ్వరరెడ్డి, జిల్లా కోశాధికారి బాలన్న మాట్లాడుతూ తోటి ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబాన్ని ఆదుకునేందుకు తమ వంతు సహకారం అందించామన్నారు. జనార్ధన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక పద్మావతి నగర్‌లో వెలసిన శ్రీకృష్ణ దేవాలయంలో ఈ నెల 17వ తేదీ నుంచి మూడు రోజుల పాటు విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు నిర్వహిస్తున్నట్లు శ్రీకృష్ణ భగవాన్ సేవాసమితి, యాదవ సంఘం నాయకులు బుధవారం తెలిపారు. ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ భక్తులు దాతల సహకారంతో ఈ నెల 17, 18, 19 తేదీల్లో శ్రీకృష్ణ, మహాగణపతి, సరస్వతీదేవీ, జయవిజయులు, గరుత్మంతుడు, ధ్వజ స్తంభం ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా శ్రీ విద్యారణ్య భారతీ స్వామి, శ్రీకృష్ణ పీఠాధిపతి శ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానందస్వామి పాల్గొంటారని తెలిపారు. 17న ఉదయాన్నే గోపూజ, గంగపూజ, యాగశాల ప్రవేశం, కలశస్థాపన, నవగ్రహ, వాస్తు మంటపారాధన, వేదపారాయణలు, 18న యంత్రాలకు అభిషేకం, 108 కలశాలతో అభిషేకం, హోమాలు, జపాలు, పారాయణం, 19న విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలు శాస్త్రక్తంగా నిర్వహిస్తామని వివరించారు.

18న రాష్ట్రస్థాయి ఎడ్ల బల ప్రదర్శన

వెలుగోడు: పట్టణంలోని హజరత్ సయ్యద్ రోఖియా బీ ఉరుసు సందర్భంగా ఈ నెల 18న శనివారం ఉదయం 8.00 గంటలకు రాష్ట్రస్థాయి ఎడ్ల బల ప్రదర్శన (న్యూ క్యాటగిరీ) పోటీలు శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సహకారంతో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వరరెడ్డి తెలిపారు. మొదటి విజేతకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి రూ.50,000 నగదు అందజేస్తారన్నారు. రెండో బహుమతి రూ.40,000 (దాతలు: వేల్పుల జయపాల్, జెడ్పీటీసీ సభ్యురాలు డి. అమీరున్ బీ), మూడో బహుమతి – రూ.25,000 (వంగాల వెంకట్రామిరెడ్డి), నాల్గో బహుమతి రూ. 15,000 (వంగాల నాగేశ్వరరెడ్డి, బన్నూరు లక్ష్మిరెడ్డి, బన్నూరు అంకిరెడ్డి, బన్నూరు జనార్దనరెడ్డి), ఐదో బహుమతి రూ. 10,000 (డాక్టర్ శశికళారెడ్డి ఏపీఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్), ఆరో బహుమతి – రూ.5,000 (అంబాల రామకష్టారెడ్డి, అంబాల నాగలక్ష్మమ్మ) అందిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే వారు రూ.600 ఎంట్రీ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. దేశం తిరుపెంరెడ్డి 9949613348 యస్. మౌలాలి – 9985569860 అంబాల ప్రభాకరరెడ్డి 9000565066 కె. అమీర్ అలీఖాన్ 9885070691 లను సంప్రదించి చీటీలు తీసుకోవాలన్నారు.

అభ్యంతరాలకు అవకాశం

- ఈ-క్రాప్ నమోదు విజయవంతం
- 17 వరకు సోషల్ ఆడిట్
- 1,09,182 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు
- ప్రభుత్వ పథకాల అమలుకు కీలకంగా మారిన ఈ-క్రాప్ నమోదు
- ఆర్‌బీకేల్లో జాబితా ప్రదర్శన





గుండుపాపల గ్రామంలో ఈ-క్రాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్),(ఇన్‌సెట్) క్రిష్టిపాడులో ఈ-క్రాప్ జాబితాను చూసుకుంటున్న రైతులు

దొర్నిపాడు: పంటలు సాగుచేసిన ప్రతి రైతు ఆ వివరాలను తప్పక ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, వైఎస్సార్ పంట రుణాలకు సున్నావడ్డీ, మద్దతు ధరకు పంటల విక్రయం ఇలా రైతులు ఏ లబ్ధి పొందాలన్నా ఈ-క్రాప్ నమోదు కీలకం. రైతు భరోసా కేంద్రాల్లోని వీఏఏలు, ఎంపీఈఓలు పంట నమోదుతో పాటు ఈ-కేవైసీ సైతం చేయించారు. డిసెంబర్ 15 నుంచి ఈ-పంట నమోదు ప్రత్యేక యాప్ ద్వారా నమోదు చేశారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు బీమా వర్తించేందుకు తహసీల్దార్, ఏడీఏ, ఆర్డీఓతో పాటు జేసీ, కలెక్టర్ సైతం ఆర్బీకేల్లో నమోదు చేసిన పంటలను సర్వే నంబర్ల వారీగా పునఃపరిశీలన చేశారు. సిబ్బంది నమోదు చేసిన సర్వే నంబర్లలో పంటసాగు ఉందా లేద మారిందా నీటి వనరులు, పంట రకం వంటి వాటిని అధికారులు పరిశీలించారు.

ఆర్‌బీకేల్లో జాబితాల ప్రదర్శన

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ-క్రాప్ ప్రామాణికంగానే వివిధ పథకాల కింద లబ్ధి చేకూరుస్తున్నాయి. ప్రస్తుతం నియోజకవర్గం వ్యాప్తంగా 1,09,152 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు అయింది. వీఏఏలు, ఎంపీఈఓలు, వీఆర్వోలు పక్కగా ఈ-క్రాప్ నమోదు చేశారు. ఈ జాబితాను నియోజకవర్గంలోని అన్ని ఆర్‌బీకేల్లో ప్రదర్శనకు ఉంచారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా చర్యలు తీసుకున్నారు. నమోదులో ఏమైనా తప్పులు దొర్లి ఉంటే రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించి సవరిస్తామని అనంతరం ఈ-క్రాప్ డేటాను బీమా కంపెనీలు, కేంద్ర ప్రభుత్వానికి పంపుతామని అధికారులు పేర్కొంటున్నారు.

రైతుల జాబితాను ఆర్‌బీకేల్లో ప్రదర్శించాం



వంద శాతం ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తయ్యింది. ప్రభుత్వం అందించే రాయితీలతో పాటు విపత్తులు, విక్రయాల సమయంలో ఎటువంటి ఇబ్బందులు ఉండవు. ఇప్పటికే ఆర్బీకేల్లో ఈ-పంట నమోదు వివరాలను ప్రదర్శించాం. వీటిపై సోషల్ ఆడిట్ చేస్తాం. ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేవచ్చు.

– శ్రీకృష్ణ, మండల వ్యవసాయాధికారి, దొర్నిపాడు

మండలాల వారీగా ఈ-క్రాప్ నమోదు వివరాలు..

మండలం	సాధరణ పంటల సాగు వివరాలు ఎకరాల్లో	ఈ-క్రాప్ నమోదు ఎకరాల్లో
ఆళ్లగడ్డ	30,227	20,669
చాగలమర్రి	16,737	12,233
దొర్నిపాడు	17,632	15,422
రుద్రవరం	17,482	17,038
శిరివెళ్ల	12,396	11,940
ఉయ్యాలవాడ	32,350	31,850
మొత్తం	1,26,824	1,09,152

ఆధార్ అనుసంధానం వేగవంతం చేయాలి

దొర్నిపాడు: ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం ప్రక్రియ వేగవంతం చేయాలని తహసీల్దార్ జయప్రసాద్ సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 75 శాతం ఆధార్ అనుసంధానం జరిగిందన్నారు. మిగతా 25 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి రోజు ఈ ప్రక్రియపై పరిశీలన ఉంటుందని, నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని సూచించారు.

వ్యక్తి ఆత్మహత్య

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణ శివారులోని నందమూరినగర్‌లో నివాసముంటున్న శ్రీనివాసులు (47) పురుగు మందు సేవించి బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తాలూకా ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాల మేరకు.. శ్రీనివాసులు, లక్ష్మీదేవి దంపతులు. వీరికి నలుగురు సంతానం. శ్రీనివాసులు లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీనివాసులు బుధవారం జీవితంపై విరక్తి చెంది పురుగు మందు సేవించి అపస్మారక స్థితిలో పడి ఉండగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.